

'పది' పరీక్షకు 406 మంది గైర్హాజరు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పదో తరగతి పరీక్షలు బుధవారం థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లీషు పరీక్ష జరిగిందని డిఇఒ కె.వెంకటేశ్వరరావు ఈ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 145 పరీక్షా కేంద్రాల్లో 29,058 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 406 మంది గైర్హాజరయ్యారని అన్నారు. జిల్లాలో 98.60 శాతం మంది విద్యార్థులు పరీక్ష రాశారని తెలిపారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఆరు కేంద్రాలను సందర్శించారని అన్నారు. అలాగే 32 కేంద్రాల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్స్, ఐదు కేంద్రాల్లో పరీక్షల సహాయక కమిషనర్ పర్యటించారని చెప్పారు. జిల్లా పరిశీలకులు ఎనిమిది కేంద్రాలను తనిఖీ చేశారని తెలిపారు.

అసమ్మతుల దారెటు?



పొందూరు మండలం రాపాకలో ప్రచారం చేస్తున్న సువ్వారి గాంధీ

- టిక్కెట్ల ప్రకటనతో భంగపడ్డ వైసిపి ఆశావహులు
- రకరకాల ప్రయత్నాల్లో నాయకులు
- ఇండిపెండెంట్లుగా కొందరు
- టిడిపికి మద్దతు పలకాలని మరికొందరు నిర్ణయం

వైసిపి అభ్యర్థుల ప్రకటనతో అసమ్మతులు రకరకాల ప్రయత్నాలు సాగిస్తోంది. టిక్కెట్లు వస్తాయని గట్టి నమ్మకంతో ఉన్న నాయకులు జాబితాలో పేరు లేకపోవడంతో భంగపాటు గురయ్యారు. పార్టీ నిర్ణయంపై కొంత మంది నాయకులు వెంటనే స్పందించి తమ పదవులకు రాజీనామా చేశారు. మరికొంత మంది తమవర్గం నాయకులతో సమాలోచనలు జరుపుతున్నారు. వీరిలో కొందరు ఇండిపెండెంట్లుగా బరిలో దిగాలని నిర్ణయించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో వైసిపి మాజీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ ఇప్పటికే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టారు. కొంతమంది అసమ్మతివర్గం నాయకులు తమ ఎమ్మెల్యేను ఈ సారి ఎన్నికలో ఎలాగైనా ఓడించాలనే కసితో టిడిపి అభ్యర్థికి లోపాయికారిగా మద్దతు పలికేందుకు సైతం సిద్ధమవుతున్నారు.

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో అధికార వైసిపికి ఇబ్బందికరంగా ఉన్న నియోజకవర్గాల్లో ఆమదాలవలస, ఎచ్చెర్ల, నరసన్నపేట, పాతపట్నం ఉన్నాయి. ఆమదాలవలసలో శాసనస స్పీకర్ తమ్మినేని సీతారాం, ఆయన కుటుంబ సభ్యుల వైఖరిపై గత కొంతకాలంగా నియోజకవర్గ నాయకులు తీవ్ర అసమ్మతితో రగిలిపోతున్నారు. నియోజకవర్గంలో పోటాపోటీ కార్యక్రమాలు చేస్తూ తమ్మినేని సవాల్ విసిరారు. టిక్కెట్ కోసం అన్ని రకాల ప్రయత్నాలు సాగించారు. ఒకానొక దశలో తమ్మినేని సీటు ఇవ్వరనే ప్రచారమూ సాగింది. పార్టీ అధిష్టానం మాత్రం తమ్మినేని సీతారాం వైపే మొగ్గుచూపింది. దీనిపై అసమ్మతి నాయకులు భగ్గుమన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సువ్వారి గాంధీ పార్టీకి రాజీనామా చేశారు. ఇండిపెండెంట్‌గా బరిలో దిగాలని నిర్ణయించారు. ఇప్పటికే పొందూరు మండలం రాపాకలో ప్రచారం మొదలు పెట్టారు.

ఎచ్చెర్లలో ఇండిపెండెంట్‌గా అసమ్మతి వర్గం అభ్యర్థి

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే గొర్లె కిరణకుమార్‌కు టిక్కెట్ రావడంపై అసమ్మతివర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఎమ్మెల్యే తీరుపై అక్కడి కేడర్ తీవ్ర అసమ్మతితో రగిలిపోతోంది. జగన్ ముద్దు... కిరణ్ వద్దు అంటూ నినదించారు. అభ్యర్థిని మార్చకపోతే ఓడిస్తామంటూ అధిష్టానానికి అల్టిమేటం సైతం జారీ చేశారు. వీటిని ఏ మాత్రం పట్టించుకోని అధిష్టానం ఎచ్చెర్ల స్థానానికి కిరణ్‌కుమార్‌కే మళ్లీ అవకాశం ఇచ్చింది. అధిష్టానం నిర్ణయంపై మండిపడ్డ అసమ్మతివర్గ నాయకులు సమావేశమై ఎచ్చెర్ల వైస్ ఎంపిపి ప్రతినిధి, మాజీ సర్పంచ్ జరుగుల శంకరరావును ఇండిపెండెంట్‌గా బరిలో దించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

పాతపట్నంలో ఆచితూచి వ్యవహరిస్తున్న వ్యతిరేక గ్రూపు

జిల్లాలో తీవ్ర అసమ్మతిని ఎదుర్కుంటున్న అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో రెడ్డి శాంతి మొదటి స్థానంలో ఉన్నారు. చాలా కాలంగా ఇక్కడి అసమ్మతి కార్యకలాపాలు తీవ్ర స్థాయిలో ఉన్నారు. ఎమ్మెల్యే తీరుకు వ్యతిరేకంగా పలు సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్యే నిర్వహించిన సమావేశాలను సైతం బహిష్కరించారు. అసమ్మతి కార్యకలాపాలు సాగిస్తున్నారంటూ జిల్లా కోశాధికారి లోతుగడ్డ తులసీప్రసాదరావు పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులూ ఎమ్మెల్యేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. టిడిపి ప్రకటించనున్న అభ్యర్థి ఎవరనేది తేలితే వారికి మద్దతు పలకాలని నిర్ణయించినట్లు సమాచారం

నరసన్నపేటలో గుంభనంగా అసమ్మతి వర్గీయులు

నరసన్నపేటలో వైసిపి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సైతం తీవ్ర అసమ్మతిని ఎదుర్కుంటున్నారు. కృష్ణదాస్ ఒంటెత్తు పోకడలు, కుటుంబం వ్యవహారశైలిపై తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కృష్ణదాస్‌కు టిక్కెట్ ఇస్తే మాత్రం తాము సహకరించమంటూ ఒకానొక దశలో తేల్చిచెప్పారు. అభ్యర్థిని మార్చకపోతే తాము భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామంటూ అధిష్టానానికి అల్టిమేటం సైతం ఇచ్చారు. పార్టీ వీటిని లెక్క చేయకుండా ఎమ్మెల్యే కృష్ణదాస్ వైపే అధిష్టానం మొగ్గ చూపింది. దీంతో అసమ్మతి వర్గం నాయకులు తలోదారి చూసుకుంటునట్లు తెలుస్తోంది. కొంతమంది టిడిపిలోకి వెళ్లాలని నిర్ణయించగా, మరికొందరు స్తబ్ధుగా ఉండాలని అనుకుంటున్నట్లు తెలిసింది.

పక్కాగా ఎన్నికల నిర్వహణ

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్



కవిటి : అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- కవిటి

ఎన్నికల విధులు పక్కాగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం మండలంలోని పెద్దకర్రివానిపాలెంలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు, ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, ఇవిఎంలు, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం ఏర్పాట్లను ఆయా అధికారులంతా వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం ఏర్పాట్ల విషయమై పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. భద్రతపరంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్ సిబ్బందికి సామగ్రిని అందించడంలో ఎలాంటి లోటుపాట్లు ఎదురు కాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఆయనతో పాటు తహశీల్దార్ ఎం.లక్ష్మి, ఎంపిడిఒ శ్రీనివాస్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, డిటి రామచంద్రరావు, ఆర్‌ఐ రమణమూర్తి పాల్గొన్నారు.

కంచిలి: తహశీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియపై స్థానిక అధికారులతో సమీక్షించారు. ఎన్నికల విధుల్లో గ్రామ వాలంటీర్లు పాల్గొనకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ రవి, ఎంపిడిఒ నీరజ, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

సోంపేట: సోంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సామగ్రిని భద్రపరిచేందుకు మౌలిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణపై స్థానిక అధికారులతో చర్చించారు. ఈయనతో పాటు ఆర్‌ఒ సుదర్శన్, సిఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ హైమావతి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



ఇచ్ఛాపురం : కవాతులో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

సరిహద్దులో అప్రమత్తం

ఇచ్ఛాపురం : ఎన్నికల నిర్వహణపై తహశీల్దార్ కార్యాలయ వద్ద ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర, కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరావురెడ్డి, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆంధ్ర, ఒడిశా సరిహద్దు ప్రాంతం పురుషోత్తంపురం చెక్‌పోస్టును పరిశీలించి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీలు ముమ్మరంగా చేయాలన్నారు. డబ్బులు, మద్యం రవాణాపై గట్టి నిఘా ఉండాలన్నారు. వాహనాలన్నీ క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లవహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణం జరిగేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనంతరం పట్టణ పుర వీధుల్లో నిర్వహించిన పోలీస్ కవాతులో పాల్గొన్నారు. బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు, మార్కెట్, దాసన్నపేట వరకు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో సిఐ టి.ఇమ్మన్యుయల్‌రాజు, డిటి శ్రీహరి, టౌన్ ఎస్ఐ సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ లక్ష్మణరావు, కవిటి ఎస్ఐ, మున్సిపల్ కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

పాతపట్నం చెక్‌పోస్టు పరిశీలన



పాతపట్నం : పరిశీలిస్తున్న ఎస్‌పిలు

ప్రజాశక్తి- పాతపట్నం

ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను శ్రీకాకుళం ఎస్‌పి జి.ఆర్.రాధిక, గజపతి జిల్లా ఎస్‌పి శ్వేతా కుమారి బుధవారం రాత్రి ఆకస్మికంగా పరిశీలించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం మరింత నిఘా పెంచాలని, రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రతి వాహనాన్నీ తనిఖీ చేపట్టి విడిచిపెట్టాలని ఆదేశించారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యం, పొగ, గుట్కా, గంజాయి దారులపై నిఘా ఉంచాలన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా ఎవరైనా ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. ఆమెతో పాటు టెక్కలి డిఎస్‌పి బాలచందర్‌రెడ్డి, పాతపట్నం సిఐ ఎం.సాయి, ఎస్ఐ మహమ్మద్ యాసిన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కవాతులో పాల్గొన్న ఎస్‌పి

కొత్తూరు : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పారామిలటరీ బలగాలతో నాలుగు రోడ్ల కూడలి వద్ద కవాతు నిర్వహించారు. ఈ కవాతులో ఎస్‌పి జి.ఆర్.రాధిక పాల్గొన్నారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎన్నికల దృష్ట్యా శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. టెక్కలి డిఎస్‌పి బాలచంద్రారెడ్డి, సిఐ ఆర్.వేణుగోపాలరావు, ఎస్ఐలు ఎం.ఎ. అహమ్మద్, నారాయణస్వామిలు పాల్గొన్నారు.



సమీక్షిస్తున్న 'ఉపాధి' పీడీ చిట్టిరాజు

విధి నిర్వహణలో అలసత్వం వద్దు

డ్వామా పీడీ చిట్టిరాజు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో ప్రతి కుటుంబానికీ మార్చి 31 నాటికి వంద రోజులు పని దినాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి.చిట్టిరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల క్షేత్ర సహాయకులుతో, సాంకేతిక సహాయకులతో, సిబ్బందితో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రెండు మండలాల్లో కూలీలకు వంద రోజులు కనిపించడంలో వెనుకబాటు తనం ఉందని, ఈ నెల 31లోగా ఆ వెనుకబాటు తనాన్ని సరిచేసుకుని సూచించారు. ఈ రెండు మండలాలు శత శాతం పనులు కల్పించి ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. పనిలో వెనుకబాటు తనం, అలసత్వం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ సిబ్బంది ఎన్నికల ప్రవర్తన నియమావళిని లోబడి విధులు నిర్వహించాలని సూచించారు. కూలీలకు రోజుకు రూ.258 తక్కువ లేకుండా రోజుకి ఆరు గంటల కాలం పాటు పనులు నిర్వహించే విధంగా చూడాలని సూచించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్లాంటేషన్ పనులు గుర్తించి పూర్తి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎపిడి శైలజ, ఎంపిడిఒ వై.పద్మజ, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి ఎపిఒలు జి.హరిప్రసాద్, బి.వాసునాయుడు, ఇసిలు టి. రాంబాబు, యు.ధర్మారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

ట్రాఫిక్ సిఐ అవతారం

శ్రీకాకుళం అర్బన్ : అతివేగంగా వాహనాలు నడపడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని నగర ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అవతారం అభిప్రాయపడ్డారు. నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో ట్రామా అవేర్‌నెస్ ప్రోగ్రాం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాయాల పాలై క్షతగాత్రులవుతున్నారని అన్నారు. ప్రమాద సమయంలో ప్రాణాలను రక్షించడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణనష్టాన్ని నియంత్రణకు తగిన జాగ్రత్తలు పాటించడం వల్ల మేలు జరుగుతుందన్నారు. అందువల్ల ప్రమాదాలు సంభవించినప్పుడు అత్యవసరంగా చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షతగాత్రులకు అత్యవసరంగా వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలన్నారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ పైల మురళీధర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగిందని, రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు అధికార యంత్రాంగం ఎన్ని హెచ్చరికలు చేసిందని, వాటిని పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ అన్నెపు శివప్రసాద్, మెడికవర్ ఆస్పత్రి హెడ్ డాక్టర్ సిహెచ్.సాగరిక, ఎమర్జెన్సీ మెడికల్ హెడ్ డాక్టర్ బాల సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షించిన కలెక్టర్



సమీక్షిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేంద్ర ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రతిఒక్క రాజకీయ పార్టీ భాగస్వాములై, సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆయా పార్టీల ప్రతినిధులకు సూచించారు. కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో 38వ వారపు సమీక్ష బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అన్ని కార్యక్రమాలను నిష్పక్షపాతంగా చేపట్టామని అన్నారు. రాజకీయ పార్టీల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో వివిధ రకాల పర్మిషన్ల కొరకు 'సువిధ' యాప్ ద్వారా ఎలా దరఖాస్తు చేసుకోవాలనే విషయంపై ఆయా పార్టీల ప్రతినిధులకు వివరించారు. జిల్లాలో ఎక్కడైనా అధికారులు కానీ, పార్టీల ప్రతినిధులు కానీ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నట్లు మీ దృష్టికి వస్తే సి.విజిల్ యాప్ ద్వారా, కమాండ్ కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబరు 1950, కాల్ సెంటర్ నంబరు 18004256625కు ఫోన్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులు ఉండవని, వాటికోసం వచ్చే దరఖాస్తులను పరిశీలిస్తామని చెప్పారు. జాబితాలో కొత్తగా పేర్లు చేర్చడానికి, ఒక చోట నుంచి మరో చోటకి ఓటు బదిలీకి మాత్రం అవకాశం ఉందని అన్నారు. 85 ఏళ్లు దాటిన వారు జిల్లాలో 11,455 మంది, వికలాంగ ఓటర్లు 21,486 మంది ఉన్నారని వీరు ఫారం 12డి సమర్పించడం ద్వారా ఇంటి నుంచే ఓటు వేసేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఇది తప్పనిసరి కాదని పోలింగ్ కేంద్రానికి వచ్చి కూడా వారు ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, డి.గోవిందరావు (సిపిఎం), రౌతు శంకరరావు (వైసిపి), పి.ఎం.జె.బాబు (టిడిపి), సురేష్ సింగ్ (బిజెపి), లాస సోమేశ్వరరావు (బిఎస్‌పి) పాల్గొన్నారు.

నేలకొరిగిన పంటలు



కొత్తూరు : నేలకొరిగిన మొక్కజొన్నను పరిశీలిస్తున్న కళ్యాణి

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

జార్ఖండ్ నుంచి కోస్తాంధ్ర వరకు కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో జిల్లాలో రెండో రోజూ పలుచోట్ల తేలిక పాటి జల్లులు కురిశాయి. వర్షాల ప్రభావంతో మొక్కజొన్న, వరి, అపరాల పంటకు కొంత మేర నష్టం వాటిల్లింది. కవిటి మండలం రాజపురంలో అత్యధికంగా 11 మి.మీ వర్షం కురిసింది. పలాసలో 9.25 మి.మీ, హిరమండలంలో 9 మి.మీ, ఇచ్ఛాపురంలో 8.75 మిమీ వర్షం పడింది. టెక్కలిలో 6.25మి.మీ, ఎల్ఎన్‌పేట ఆరు మి.మీ పాతపట్నం మండలంలో 5.25 మి.మీ, నందిగాంలో 4.5మిమీ వర్షపాతం నమోదయింది.

సరుబుజ్జిలి : పలు గ్రామాల్లో బుధవారం వేకువజాము నుంచి ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు కురవడంతో వరి పంట నేలకొరిగింది. మండలంలోని జొన్నవలస, మునగవలస, దన్నన్నపేట పరిసర ప్రాంతాల్లో వంశధార కుడి కాలువ సాగునీటి ఆధారంతో రైతులు రబీ సాగుగా వరి పంట వేశారు. వంశధార నీటి ఆధారంతో పాటు రైతులు పలు చెరువుల నుంచి నీటి ఇంజిన్లు సహాయంతో వరి పంటను పండించి చివరి దశకు తీసుకువచ్చారు. మరికొద్ది రోజుల్లో వరి పంటను కోత కోసి ధాన్యం బస్తాలు ఇంటికి చేరుతాయన్న సమయంలో అకాల వర్షాలతో ఇబ్బందులకు గురవుతున్నామని రైతులు వాపోతున్నారు. నాలుగు నెలలుగా వ్యవసాయ పెట్టుబడులతో పాటు కుటుంబ సభ్యులు యావన్మంది పంట భూమిపై నమ్మకాన్ని పెట్టుకొని సాగు చేసిన వరి పంట చివరి దశలో వరుణుడి రూపంలో పంట నష్టం సంభవించడంపై అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

కొత్తూరు : ఈదురు గాలులతో కూడిన వర్షంతో మండలంలోని కర్లెమ్మ పంచాయతీ బడిగాంలో చొడవరపు కొండలరావు, చీడి భాస్కరరావు, అగత ముడి భీముడులకు చెందిన రెండెకరాల అరటి, మొక్కజొన్న పంటలు పూర్తిగా నెలకొరిగాయి. చేతికి వచ్చిన పంట దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. ఆర్‌బికె వ్యవసాయ సహాయకలు కళ్యాణి నేతలను కొరిగిన పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శరీరంలోని ముఖ్యమైన అవయవాల్లో కళ్లు ఒకటని, కళ్లను ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ నూతన భవనంలో ఐ ఎక్స్ ప్రెస్ సంస్థ ఆధ్వర్యాన న్యాయవాదులకు బుధవారం ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ముందుగా ఈ శిబిరాన్ని జడ్జి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేంద్రియానాం నయనం ప్రధానమని ఆయన గుర్తు చేశారు. నేటి ఆధునిక యుగంలో టివిలు, స్మార్ట్‌ఫోన్లు ఎక్కువగా వాడడం వల్ల కంటి శుక్లాలు దెబ్బ తింటున్నాయన్నారు. చిన్నారులను సాధ్యమైనంతవరకు స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంచాలని చెప్పారు. నేత్ర సమస్యలు వచ్చిన వెంటనే సొంత వైద్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. న్యాయవాదులకు దినేష్ నేత్రాస్పత్రి డాక్టర్ దినేష్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ ఆపధర్మ అధ్యక్షులు, న్యాయశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎన్ని సూర్యారావు, న్యాయవాదులు కద్దాల శ్యాంసుందరరావు, గొంటి చంద్ర మౌళి, చౌదరి లక్ష్మణరావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్, పాడి సీతంనాయుడు, అసోసియేషన్ మాజీ అధ్యక్షులు బెజ్జిపురపు ఫాల్గుణరావు, జల్లు తిరుపతిరావు, పాలిశెట్టి మల్లిబాబు, వినియోగదారుల హక్కుల సంఘం జిల్లా సెక్రెటరీ నిహార్‌నాయుడు, ఐ ఎక్స్ప్రెస్ సంస్థ మేనేజర్లు మజ్జి సుమన్, లక్ష్మణరావు, మజ్జి స్వాతి, సాయికుమార్, వెంకటేష్, జయరాం పాల్గొన్నారు.



ఎంపీ కాన్వాయ్‌ను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎంపీ కాన్వాయ్ తనిఖీ

ప్రజాశక్తి- పలాస, పొందూరు

పలాస లక్ష్మీపురం బ్రిడ్జి వద్ద ఎంపీ రామ్మోహన్ నాయుడు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష కాన్వాయ్‌ను ఎన్నికల కోడ్‌లో భాగంగా ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యాన పోలీసులు బుధవారం తనిఖీ చేపట్టారు. కాశీబుగ్గలో టిడిపి నాయకులు ఇంటికి వెళ్లేందుకు వీరిద్దరూ వచ్చారు. అందులో భాగంగా పోలీసులు కాన్వాయ్ తనిఖీ చేపట్టి కోడ్‌కు విరుద్ధంగా ఏమీ లేదని నిర్ధారించి విడిచి పెట్టారు. అలాగే పొందూరు మండలం రాపాక వద్ద ఎంపీ కాన్వాయ్‌ను తనిఖీ చేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉదయలక్ష్మి

ప్రజాశక్తి- పొందూరు



ఉదయలక్ష్మి, ప్రిన్సిపాల్

పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సిహెచ్.ఉదయలక్ష్మి బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఈమె ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేసి ఇక్కడకు ఉద్యోగోన్నతిపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, ప్రజలు తనకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. ముందుగా ఆమెకు కళాశాల సిబ్బంది స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM JUDICIAL MAGISTRATE OF I CLASS FOR SPECIAL MOBILE AT SRIKAKULAM.
O.S.371/2021

Between:-
Ravada Rama Rao & others ---Plaintiffs.
And:-
Mukku Rajamma&other ---Defendants.
To,
D-1: Mukku Rajamma, W/o late Samudram, resident of SC Colony, Siddhipeta Village, Chapuram Panchayat, Srikakulam Mandal, Srikakulam District.

పై నెంబర్ దావాలో వాది దావా షెడ్యూలు ఆస్తిలో తన వాటా నిమిత్తం దాఖలు చేసియున్నది. సదురు దావా **తేదీ 24-04-20234** మీ హాజరు నిమిత్తం వాయిదా అయియున్నది. ఆ దినం మీరు పైకోర్టులో **ఉ॥ 10.30 గం॥ లకు** స్వయంగా గాని మీ తరుపు అడ్వకేట్ ద్వారా గాని పై కోర్టుకు హాజరై మీకు గల అక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు కేసు విచారించి తీర్మానించడమగును.

// కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం. //

జి.ఎస్.కె. ప్రసాద్
తంగి వాసుదేవరావు
వాది తరపు న్యాయవాదులు, శ్రీకాకుళం,
ఫోన్: 7095193800.

IN THE HON'BLE COURT OF THE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT SRIKAKULAN.
C.C. 71/2023.

Between:
Penugurthy Anandharaju
---Complainant.
And:
The Prop., KVR Motors and another
---opposite parties.
To,
Opposite party No.1:
The prop. KVR Motors, rep., its M.D., Si Venkata lakshmi Nivas, opp: Harika Inn kalyanamandapam, and TVS Showroom, Peddapadu Road, Sikakulam.

పై నెంబరు సి.సి.లో మీకు నోటీసు సర్వీస్ గానందున పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తం **తేది 02-04-2024న** వాయిదా యున్నది. గనుక సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేటు ద్వారా గాని కోర్టుకు పై **తేదిన ఉదయం 10.30 గం॥లకు** హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ పరుచు కొనవలెను. లేనియెడల మీపరోక్షమున విచారించి తీర్మానించచడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం //

పైడి రాజమనోహర్
న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్: 9494589325.



ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు

ఎంపీ, ఎమ్మెల్యే ప్రచారం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

భావితరాల భవిష్యత్‌కు చంద్రబాబును సిఎంగా చేసుకోవాలని టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని కిత్తయ్యపేట, యండపేట, సోమనాథపురం, కొండపేట, పట్టుపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టుపురంలో మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మండల నాయకులు కింజరాపు హరివరప్రసాద్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, కర్రి అప్పారావు, మెండ దాసునాయుడు, దేవాది సింహాద్రమ్మ, జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రచార వాహనాల ప్రారంభం

స్థానిక టిడిపి కార్యాలయంలో ఎన్నికల ప్రచార వాహనాలను బుధవారం టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. అలాగే మండలం చుట్టుగుండంకు చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు అచ్చెన్నాయుడు సమక్షంలో టిడిపిలో చేరారు. వీరికి ఆయన పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బోయిన రమేష్, బగాది శేషు, నాయకులు హరివరప్రసాద్, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, రామకృష్ణ, సింహాద్రి పాల్గొన్నారు.



కృష్ణారావుకు కండువా వేస్తున్న మంత్రి అప్పలరాజు

వైసిపిలోకి కృష్ణారావు

ప్రజాశక్తి- పలాస

టిడిపి క్రియాశీలక రాజకీయాల్లో గతంలో చురుగ్గా పనిచేసిన వజ్రపుకొత్తూరు మండలం టిడిపి నాయకుడు డాక్టర్ దున్న కృష్ణారావు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వైసిపిలో చేరారు. కృష్ణారావుకు మంత్రి అప్పలరాజు, వైసిపి ఎంపి అభ్యర్థి పేడాడ తిలక్ పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పాలిన శ్రీనివాసరావు, వజ్రపుకొత్తూరు మండల ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయకుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు దువ్వాడ మధుకేశ్వరరావు, వైస్ ఎంపిపి తమ్మినేని శాంతారావు, బత్తిన లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కోటబొమ్మాళిలో...

కోటబొమ్మాళి : మండలంలోని నీలంపేట, సోమనాథపురం గ్రామాలకు చెందిన పలువురు టిడిపి నాయకులు బుధవారం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ సమక్షంలో టిడిపిని వీడి వైసిపిలో చేరారు. వీరికి ఎమ్మెల్సీ, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో బొట్ట చిన్నప్పుడు, పిట్ట అప్పయ్య, పళ్ళ రాజారావు, సూర్యనారాయణతో పాటు 100 కుటుంబాలు పార్టీలో చేరాయి. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నూక సత్యరాజ్, వైస్ ఎంపిపి దుక్క రోజా, విప్ బొడ్డు అప్పన్న, నాయకులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న సుప్రజ రౌత్

చిన్నారికి ఎస్‌డిపి రక్తదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్


పది మంది ప్రాణాలు కాపాడటమే నా ధ్యేయమని, ఇప్పటివరకు నలభై ఏడుసార్లు రక్తదానం చేసినట్టు సుప్రజ రౌత్ తెలిపారు. రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఏ-వన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 12 నెలల చిన్నారికు అత్యవసరంగా ఓ పాజిటివ్ సింగల్ డోనర్ ప్లేటిలెట్స్ బుధవారం ఆమె అందించారు. మదర్స్ లవ్ ఫౌండర్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఆమె ఎస్‌డిపి రక్తాన్ని అందించి చిన్నారి ప్రాణాలు కాపాడింది. ఈ సందర్భంగా ఆమెను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అభినందించారు. కార్యక్రమంలో లయన్స్ బ్లడ్ బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్, రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు చిన్మయరావు, సామాజిక సేవకులు ఉర్లం శివతేజ, రెడ్‌క్రాస్ వైద్యులు జి.ఆర్.శ్రీకాంత్, ఆయిషా బేగం, గుణాకర్, అనంతపల్లి నర్సింగరావు ఆపల్గొన్నారు.

వర్షంలో సైతం ఆగని దీక్ష

కవిటి: ఓవైపు జోరువాన కురుస్తున్నా వెరవకుండా బెంతు ఒరియాలు తమ దీక్షలు కొనసాగించారు. తమజాతి గుర్తింపు, తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 84వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా బుధవారం దీక్షలో కమిటీ సభ్యులు, ఆటో డ్రైవర్లు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ తమజాతికి గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ప్రభుత్వ పథకాలకు కూడా దూరమవుతున్నారని తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నందిగాం: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దేవపురం మాజీ సర్పంచ్ సిస్టు గున్నయ్య కుటుంబాన్ని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు మంగళవారం కొండ తెంబూరులో కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈయనతో పాటు మృతుని భార్య సరోజని, నాయకులు అజయ్ కుమార్, బాలకృష్ణ ఉన్నారు.



హార్లిక్స్ పంపిణీ చేస్తున్న యువత

విద్యార్థులకు హార్లిక్స్ పంపిణీ

కవిటి : మండలం బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన యువత అండగా నిలుస్తున్నారు. గత రెండు రోజులుగా మజ్జిగ పంపిణీ చేస్తున్న యువత బుధవారం చలిగాలులకు గురైన విద్యార్థులకు వేడివేడి హార్లిక్స్ పంపిణీ చేశారు. అనంతరం యువత మాట్లాడుతూ వేసవి తీవ్రత దృష్ట్యా పదో తరగతి పరీక్షలు పూర్తయ్యే వరకూ మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తామని, కానీ బుధవారం హోరుగాలితో కురిసిన వర్షంతో విద్యార్థులు చలి గాలులకు గురయ్యారని, దీనిని దృష్టిలో ఉంచుకుని గ్రామానికి చెందిన కిరణ్ ఆర్థికసాయంతో 350 మంది విద్యార్థులకు హార్లిక్స్ అందించినట్లు తెలిపారు.

చినుకు పడితే చిత్తడే



సరుబుజ్జిలి వద్ద అలికాం-బత్తిలి ప్రధాన రహదారి దుస్థితి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సరుబుజ్జిలి మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న చిరుజల్లులతో అలికాం-బత్తిలి ప్రధాన రహదారి చిత్తడిగా మారి వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిలోని సవలాపురం జంక్షన్ నుంచి మండల కేంద్రమైన సరుబుజ్జిలి వరకు భారీ గుంతలు ఏర్పడడంతో గత కొంతకాలం నుంచి భారీ వాహనాలు గుంతల్లో ఇరుక్కుపోయి అప్పుడప్పుడు ట్రాఫిక్ నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు నెలలుగా ఎటువంటి వర్షాలు లేకపోవడంతో రహదారిపై ఉన్న గుంతలను స్థానిక పోలీసులు మట్టితో పూడ్చి వేయడం వలన వాహనాల రాకపోకలకు కొంతమేర ఇబ్బంది లేకుండా వాహనదారులు ప్రయాణాలు కొనసాగించారు. ప్రస్తుతం రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుంతలన్నీ వర్షపు నీటితో పూర్తిగా నిండిపోయి ఉండటంతో వాహనదారులకు రహదారి ఎక్కడ ఉందో తెలియక కొంతమంది ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి పల్టీలు కొడుతున్నారు. బుధవారం ఉదయం నాటికి సరుబుజ్జిలి జంక్షన్ సమీపంలో ఉన్న ఎబి రోడ్డు గుంతలన్నీ నీటితో పాటు బురదమయంగా మారడంతో కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు సాహసోపేతమైన ప్రయాణాలు సాగించాల్సి వస్తుందని వాపోతున్నారు. నాలుగు కిలోమీటర్ల రహదారి అభివృద్ధి నిర్మాణ పనులకు 2023 నవంబర్ 1న స్పీకర్ తమ్మినేని సీతారాం సరుబుజ్జిలి జంక్షన్ వద్ద శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. రూ. 2 కోట్ల 75 లక్షలు నిధులు మంజూరయ్యాయి. నెల రోజుల్లో ఈ నాలుగు కిలోమీటర్ల రహదారి అభివృద్ధి పూర్తి చేస్తామన్న అధికారుల జాడ నేటికీ కనిపించకపోవడంపై పలువురు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. గుంతల పరిమాణం రోజురోజుకు పెరుగుతూ నేల బావులుగా మారుతున్నాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికైనా రోడ్లు, భవనాల శాఖ అధికారులు అలికాం-బత్తిలి రహదారి మరమ్మతులు చేపట్టి వాహనదారులు, ప్రజల సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



పోలీస్ స్టేషన్ సమీపంలో బురదమయంగా మారిన ప్రధాన రహదారి

ఓటుహక్కుపై అవగాహన



టెక్కలి రూరల్ : మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎపిఎం నారాయణరావు



నందిగాం : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సంఘాల సభ్యులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మహిళలందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎపిఎం గురువెల్లి నారాయణరావు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఓటుహక్కుపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటుహక్కు ఒక వజ్రాయుధమని, ప్రతిఒక్కరూ మంచి వ్యక్తికి ఓటు వేసి ఎన్నుకోవాలన్నారు. సిసిలు పద్మ, వరదరాజులు, విఎఒలు పాల్గొన్నారు.

కవిటి: ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక మహిళా సమాఖ్య భవనంలో మహిళా సంఘాలు సభ్యులకు ఎపిఎం గోవిందరావు, సోషల్ మొబలైజర్ మల్లేశ్వరరావు అవగాహన కల్పించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా స్థానిక మహిళా సమాఖ్య భవనం, బస్టాండ్ కూడలిలో మానవహారం నిర్వహించి ఓటుహక్కు ప్రాధాన్యత వివరిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంఎంఎస్ సిబ్బంది, ఒబిసి సభ్యులు, విఒఎలు పాల్గొన్నారు.

నందిగాం: మండలం శారదాపురం, రౌతుపురం, కాశీరాజా కాశీపురం, కామదేనువు, దొడ్ల రామచంద్రాపురం తదితర గ్రామాల్లో ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది సావిత్రి, తిరుమలా దేవి, లీలావతి, గ్రామైక్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పలాస: మండలం శాసనం, అలుకోల్ల, బ్రాహ్మణతర్లా, టెక్కలిపట్నం, లొద్దభద్ర గ్రామాల్లో మహిళా స్వయంశక్తి సంఘ సభ్యుల అధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఒ బి.మల్లేశ్వరరావు, వెలుగు సిసి దారపు వెంకటేశ్వరరావు, సిసిలు వెంకటరమణ, నాగమ్మ, రేణుక, విఒఎలు, సిఎఫ్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ఆమదాలవలస: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఎన్నికల విధానంలో శత శాతం మహిళా ఓటే మీ పిల్లల భవిష్యత్‌కు చోటని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని సైలాడ, గాజులకొల్లివలస, శ్రీనివాసాచార్యులపేట, చింతలపేటలో అవగాహన కల్పించారు.. స్వీప్ యాక్టివిటీస్, సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రారల్ పార్టిసిపేషన్ కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. క్లస్టర్ కో-ఆర్డినేటర్లు ఉమారామప్పడు, విఒఎలు సుజాత, గురుమూర్తి, సుశీల, కళ్యాణి పాల్గొన్నారు.



కవిటి : మానవహారం నిర్వహిస్తున్న మహిళా సంఘ సభ్యులు



పలాస : అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న స్వయంశక్తి సంఘాల సభ్యులు



ఆమదాలవలస : ప్రతిజ్ఞ చేయిస్తున్న కూర్మారావు



తనిఖీలు నిర్వహిస్తున్న అదనపు ఎస్‌పి ప్రేమ్ కాజల్

చెక్‌పోస్టు తనిఖీ

మెళియాపుట్టి: జిల్లా సరిహద్దుగా ఉన్న మెళియాపుట్టి మండలం గొప్పిలి అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టులను జిల్లా అదనపు ఎస్‌పి జి.ప్రేమ కాజల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వాహనాల రాకపోకలు, తనిఖీలను పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున చెక్ పోస్ట్ సిబ్బంది ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమ నగదు, మద్యం, నాటు సారా, గంజాయి రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈమెతోతో పాటు ఎస్ఐ టి.రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.



రాపాకలో ప్రచారం చేస్తున్న గాంధీ

'సువ్వారి' ప్రచారం

ప్రజాశక్తి- పొందూరు

ఆమదాలవలస నియోజకవర్గంలో కొన్నేళ్లుగా సాగుతున్న కుటుంబ రాజకీయాల అవినీతిని అంతమొందించాలని స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ అన్నారు. మండలం రాపాకలో బుధవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించి మాట్లాడుతూ ఆమదాలవలస ఆత్మగౌరవం కోసమే తాను పోటీ చేస్తున్నానని, కుటుంబ రాజకీయాలకు చరమగీతం పాడాలన్నారు. అనంతరం ఇంటింటా వెళ్లి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. పలు గ్రామాలకు చెందిన మద్దతుదారులు పాల్గొన్నారు.

ఆందోళనలో రైతన్న

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కురవడంతో అపరాలకు అంతులేని నష్టం వాటిల్లుతుందని మండల రైతుల ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన మినప, పెసర, నువ్వులు పూత కొచ్చిన జీడి, మామిడి వంటి పంటలకు నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ పంటలను పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

వాతావరణ సమతుల్యంపై పక్షుల జీవనం

ప్రజాశక్తి- నందిగాం

వాతావరణ సమతుల్యమే పక్షుల జీవనానికి, మనుగడకు ఉపయోగపడుతుందని పాఠశాల హెచ్ఎం కె.గున్నయ్య అన్నారు. మండలంలోని పెద్ద తామరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా పిచ్చుకలు, ఇతర పక్షిజాతులను కాపాడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, పిచ్చుకలు అంతరించిపోకుండా ఉండాలంటే వాతావరణ సమతుల్యం, సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు బాలక శంకరరావు మాటాడుతూ ప్రతిఒక్కరు వేసవిలో పక్షులకు నీరు ఏర్పాటు చేయాలని, పక్షులను బందించకూడదని, పక్షిజాతులు అంతరించిపోకుండా ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. పక్షులకు గింజలు అందించాలని విద్యార్థులకు సూచించారు. పిచ్చుకల బొమ్మలను విద్యార్థులచే డ్రాయింగ్ వేయించడంతో పాటు ప్రదర్శించారు.



పిచ్చుకల బొమ్మలతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

మూడో రోజుకు శిబిరాలు

నరసన్నపేట: స్థానిక ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులచే ప్రత్యేక శిక్షణా శిబిరం మూడవ రోజు ఒడిఎఫ్ ప్రోగ్రాం, పారిశుద్ధ కార్యక్రమాలు సత్యవరం గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఒడిఎఫ్ ప్రోగ్రాంపై వాలంటీర్ల కు అవగాహన సదస్సును ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు, పిఒ పోగోటి మోహనరావు నిర్వహించారు. అనంతరం ఒడిఎఫ్ ప్రోగ్రాంపై వాలం టీర్లతో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. గురువారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో మోక్ష బ్లెడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తామని సహకరించాలని కోరారు.

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని ధర్మ నీలాపురంలో జాతీయ సేవా శిబిరం నిర్వహించారు. వలంటీ ర్లు ఇంటింటికి వెళ్లి విద్య, ఉద్యోగ, సాధికారతపై సర్వే నిర్వహించారు. ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సంతోష్ కుమార్ పిఒ డి.వాసుబాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గోవిందమ్మ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్తూరు: మండలం గురండి, పాతపాడు గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా 3వ రోజు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు నిరక్షరాస్యత సదస్సు నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ జి.కృష్ణారావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సర్పంచ్ వెంకట రమణయ్య, ప్రోగ్రాం అధికారులు చిరంజీవి, హరి ప్రసాద్ పాల్గొన్నారు.



నరసన్నపేట : సత్యవరంలో మానవహారం నిర్వహిస్తున్న వాలంటీర్లు



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ఉషారాణి మృతి తీరని లోటు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రేడ్-1 హాస్టల్ వెల్ఫేర్ అధికారి వాన ఉషారాణి మృతి ఆమె కుటుంబానికి తీరని లోటని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాలకపాటి రఘువర్మ అన్నారు. నగరంలోని పాతశ్రీకాకుళంలో ఉన్న ఆమె స్వగృహం వద్ద బుదవారం నిర్వహించిన సంతాపసభలో పాల్గొన్నారు. ముందుగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో బాధాతప్త హృదయాలను ఆదుకున్న గొప్ప మానవతా వాది అని కొనియాడారు. మూడు దశాబ్దాలుగా బడుగు, బలహీనవర్గ బాలికల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆమె ఆశయలను సాధించే దిశగా కుటుంబ సభ్యులు ముందుకు సాగాలన్నారు. ఆమె స్ఫూర్తి ఎంతో మందికి ప్రేరణ కావాలని ఆకాంక్షించారు. ఈయనతో పాటు సీనియర్ న్యాయవాది వాన కృష్ణచంద్, శిష్టకరణ సంఘం నాయకులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, బిసి ఉద్యమ నాయకుడు రౌతు గోపి, లోలుగు వెంకట రాజశేఖర్, ఆదిత్య వాకర్స్‌క్లబ్ జి. రాజగోపాలనాయుడు, తూర్పుకాపు సంఘం ప్రతినిధులు శాసపు జోగినాయుడు, లంక బావాజీనాయుడు ఉన్నారు.

నిత్య పరీక్షలతో గ్లకోమాకు అడ్డుకట్ట

ఎచ్చెర్ల: ప్రజలను అంధత్వం వైపు తీసుకువెళ్లే గ్లాకోమా వ్యాధి భారత్‌లో రోజురోజుకూ వేగంగా విస్తరిస్తుందని గీతం వైద్య శాస్త్ర పరిశోధన సంస్థ(విశాఖ)కు చెందిన నేత్ర వైద్య అధ్యాపకులు ప్రొఫెసర్ పి.వీణా బెన్ స్వరూప్ అన్నారు. ఆసియాలో చైనా, భారత్ దేశ ప్రజలు అధికంగా ఈ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. గ్లకోమా నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా ఈ వ్యాధిపై డా.బి.ఆర్.అంబేద్కర్ విశ్వ విద్యాలయంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య వక్తగా హజరైన ఆమె మాట్లాడుతూ గ్లాకోమా రావడానికి కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలు వివరించారు. భారత్‌లో ఏటా పన్నెండు మిలియన్ల ప్రజలు ఈ వ్యాధికి గురవుతున్నారన్నారు. 40 ఏళ్లతరువాత అధికంగా ఇవి బయట పడతాయని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మైనస్ పవర్ ఉన్నవారు ఖచ్చితంగా కంటి వైద్యుల సలహాలను పాటించాలన్నారు. బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని మాట్లాడుతూ మనిషి జీవన పయనంలో నేత్రాలు ఎంతో ముఖ్య మని, వాటిని పరిరక్షించుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, డా.కె స్వప్న వాహిని, డా.ఎం.మధులత తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా గ్లాకోమా క్యూఆర్ కోడ్‌కు సంబంధించిన ప్రత్యేక స్టాంప్ పత్రాన్ని వైస్ ఛాన్సలర్ రజని ఆవిష్కరించారు.



పుష్పగుచ్ఛం అందిస్తున్న వైస్ ఛాన్సలర్ రజని

దంత సమస్యలపై అప్రమత్తం

డిఎంహెచ్ఒ డాక్టర్ మీనాక్షి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దంత సమస్యలు రాకుండా ఎల్లప్పుడు నోటిని శుభ్రంగా ఉంచుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి సూచించారు. ప్రపంచ నోటి సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులకు దంత సంరక్షణపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రోగ్రాం అధికారి డాక్టర్ సి.పి.శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నోటి శుభ్రతపై శ్రద్ధ చూపకపోతే నోటి నుంచి దుర్వాసన, పంటి నొప్పి, చిగుళ్ల నుంచి రక్తం ఇతర దంత సమస్యలు సంభవిస్తాయని తెలిపారు. నోటి శుభ్రతకు ప్రతిఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అలాగే పోషకాహారం క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా దంతాలను సంరక్షించు కోవాలని తెలిపారు. దంత వైద్య నిపుణులు డాక్టర్ కుసుమ మాట్లాడుతూ విద్యార్థులు దంతావధానం చేయడంలో మెలకువలను వివరించారు. అనంతరం నగరంలో విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ రమ్య, రాగిణి నరసింహం, అప్పారావు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

వృద్ధునికి గాయాలు

ప్రజాశక్తి- పలాస



చికిత్స పొందుతున్న వృద్ధుడు

కాశీబుగ్గ ఎల్‌సి (లెవెల్ క్రాసింగ్) గేటు సమీపంలో ఒడిశా రాష్ట్రం కటక్‌కు చెందిన పూర్ణ డకోరి రైలు నుంచి జారిపడి వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు మంగళవారం రాత్రి గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి రైలు పట్టాల మధ్యలో పడిపోవడంతో మృతి చెందారని అనుకొని బుధవారం ఉదయం వెళ్లి చూసేసరికి ప్రాణాలతో ఉండడంతో 108 వాహనంలో పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం టెక్కలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అయితే క్షతగాత్రుడు వివరాలు ఇంకా తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పలాస జిఆర్‌పి ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

టిడిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి- పోలాకి

మండలంలో తలసముద్రం, కొల్లివలస గ్రామాల్లో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నుంచి 20 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వారికి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైకో పాలనను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, బైరి భాస్కరరావు, రోణంకి కృష్ణంనాయుడు, ప్రగడ ఆనంద్, మాజీ సర్పంచ్ ప్రగడ సూరిబాబు, జనసేన నాయకులు బలగ ప్రవీణ్ కుమార్, శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

సంక్షేమానికి ప్రాధాన్యం

ప్రజాశక్తి- టెక్కలి

టిడిపి హయాంలోనే ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత కల్పించబడుతుందని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు అన్నారు. సూపర్ సిక్స్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని మోదుగువలసలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. టిడిపి ప్రభుత్వం అధికారం చేపడితే అమలు చేయబోయే పథకాలపై పోస్టర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, మహిళ అధ్యక్షురాలు మెండ దమయంతి, కోళ్ల లవకుమార్, దల్లి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న పరిమళ

ఎమ్మెల్యే సతీమణి ఇంటింటా ప్రచారం

ప్రజాశక్తి- లావేరు

ఎచ్చెర్ల నియోజకవర్గ ఎమ్మెల్యేగా మరోసారి అవకాశం ఇవ్వాలని రణస్థలం మాజీ ఎంపిపి, ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ భార్య గొర్లె పరిమళ ప్రజలకు విజ్ఞప్తి చేసారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అదపాకలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి కిరణ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతంనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసరావు, దన్నాన రాజనాయుడు, మాజీ సర్పంచ్‌లు నడిమింటి కుమారి, గొర్లె అప్పలనాయుడు, ఎంపిటిసి గంట్యాడ సత్యం పాల్గొన్నారు.



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

విద్యార్థులకు ధ్రువపత్రాల పంపిణీ

ప్రజాశక్తి- పలాస

స్కిల్ డెవలప్మెంట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సూర్యతేజ కళాశాలలో బుధవారం ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఎపి స్కిల్ డవలప్మెంట్ కార్పోరేషన్ ఆధ్వర్యంలో స్థానిక సూర్యతేజ కళాశాలలో ఫిబ్రవరి 5 నుంచి 19 వరకు నిర్వహించిన అపట్యూబుడ్ శిక్షణా తరగతుల్లో 153 మంది విద్యార్థులు శిక్షణ తీసుకోగా 23న నిర్వహించిన ఫైనల్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎపిఎస్ఎస్‌డిసి కో-ఆర్డినేటర్ ఎస్.వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ దానేజి పద్మజ, ఉన్నతి ఫౌండేషన్ ఎస్‌బిఐ తామాడ కిరణ్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

పనిచేసే వారికే పదవులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైసిపిలో నిస్వార్థంగా పనిచేసిన వారికి పదవులు వరిస్తాయని, ప్రజా సేవ చేయడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. పెదపాడులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పొన్నాడ రుషి అధ్యక్షతన ఎస్‌సి సెల్ నగర శాఖ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం నగరశాఖ నూతన కమిటీని ప్రకటించారు.

హారిక డెంటల్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని డే నైట్ కూడలిలో హారిక డెంటల్ అండ్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌ను వైద్యులు దానేటి శ్రీధర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హాస్పటల్ యాజమాన్యాన్ని అభినందించారు. జిల్లాలో అధునాతన వైద్య సేవలు, ఇతర ప్రాంతాలకు దీటుగా అందుబాటులోకి వస్తున్నాయని అన్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లి వ్యయప్రయాసలతో వైద్యం చేయించుకోవాల్సిన అవసరం లేకుండా అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ల్యాబ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం శుభ పరిణామన్నారు. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న యాజమాన్యం